క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన సీఈఓ



జెడ్పీ సీఈఓ దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ దంపతులు

వి.కోట: జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ గ్లోరియా ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం మండలంలో కొత్తూరులో జెడ్పీ చైర్మన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో సీఈఓ కలిశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ దంపతులు సీఈఓ గ్లోరియా దంపతులను సత్కరించారు. నరేంద్ర, అమరనాథ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాతల విరాళం

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 28న నిర్వహించనున్న సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు చేయబోయే ప్రయోగాలకు దాతలు విరాళాలు అందజేశారని సైన్స్ టీచర్ వెంకట సిద్దులు తెలిపారు. కల్లూరుకు చెందిన కిషోర్ రూ.7500వేలు, వీరయ్య రూ.3వేలు, బాలాజి రూ.2వేలు, హేమంతరాజు రూ.2వేలు ఇచ్చారని చెప్పారు. దాతల సహకారంతో విద్యార్థులు మరిన్ని ప్రయోగాలు చేయడానికి వీలుంటుందన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న సీఐ

పులిచెర్ల(కల్లూరు): రాబోవు ఎన్నికల నేపథ్యంలో కల్లూరు హైస్కూల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లను శుక్రవారం కల్లూరు సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. విదుత్, తాగునీరు, మరుగుదొడ్ల..మొదలైన వసతులు తప్పనిసరిగా ఉండాలని ఆయన చెప్పారు. ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్

చౌడేపల్లి: మండలంలోని శెట్టిపేట పంచాయతీ యర్రపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ తెలిపారు. దీనిని సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఉపసర్పంచ్ యశ్వంత్‌రాజు, సచివాలయ కన్వీనర్ సుబ్రమణ్యం రాజు ప్రారంభించారు. పాలాల్లో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోరు వద్దకు రూ.5.50 లక్షలతో 11కేవీ 10 స్తంభాలను ఏర్పాటు చేసి ప్రత్యేక లైన్‌తోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చినట్లు ట్రాన్స్‌కో ఏఈ చెప్పారు. గతంలో తాగునీటికి ఇబ్బంది పడేవారమని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఆ సమస్య తీరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'జగనన్న గోరుముద్ద'ను ఎంపీపీ రెడ్డెప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకాలను రుచి చూసిన ఆయన.. సరిగా వండలేదంటూ భోజన కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలతో భోజనం పెట్టకపోతే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, ఎంఈఓ గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ రోజు

ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

వి.కోట: మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం పలు నూతన భవనాలు, సీసీ రోడ్లను ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభిస్తారని ఎంపీపీ యువరాజు శుక్రవారం తెలిపారు. తొలుత ఉదయం 9 గంటలకు పెద్దబరినేపల్లె గ్రామ సచివాలయం ప్రారంభిస్తారని, ఆ తర్వాత వరుసగా యస్ బండపల్లెలో సీసీ రోడ్లు, ముదరందొడ్డి పంచాయతీలో వైఎస్‌ఆర్ కాలనీ, దీసీసీ కాంప్లెక్స్, సీసీ రోడ్లు, నడమంత్రంలో సీసీ రోడ్లు, మద్దిమాకుపల్లెలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఏడుచుట్ల కోటలో సీసీ రోడ్లు, సుద్దుకుప్పంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ కినిక్‌ను ఆయన ప్రారంభిస్తారని వివరించారు.

గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశం

కుప్పం: నియోజకవర్గంలోని గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ తెలిపారు. ముఖ్యఅతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ హాజరవుతారని, గుత్తార్లపల్లె వద్ద ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి మసెమ్మ జాతర

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లెలో ఈనెల 24, 25న మసెమ్మ జాతర నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. జాతరలో అమ్మవారికి తొలి పూజను ఆచారం ప్రకారం వడ్డిబోయుల కులస్తులు చేస్తారు. 25న భక్తుల దర్శనార్థం అమ్మవారిని మసెమ్మ ఆలయం వద్ద నిలుపుతారు.

కుప్పం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

- చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నా సంక్షేమం, అభివృద్ధిలో వివక్ష చూపని జగనన్న
- కుప్పం ప్రజల దశాబ్దాల కల సాకారం చేశారు
- హంద్రీ–నీవాతో తాగు, సాగునీరు
- రిజర్వాయర్ల నిర్మాణానికి భూమిపూజ
- చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: ప్రతిపక్ష పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కుప్పంలో ప్రాతినిధ్యం వహిస్తున్నా రాజకీయాలకు అతీతంగా కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, చిత్తూరు ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, ఎంపీ రెడ్డెప్ప పునరుద్ఘాటించారు. శుక్రవారం స్థానిక శ్రీశక్తి భవనంలో కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఈ నెల 26న కుప్పం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువల ద్వారా నీటిని కుప్పం ప్రాంతానికి వచ్చేలా ప్రారంభిస్తారన్నారు. ప్రస్తుతం ఎండ కాలం కావడంతో కొన్ని చెరువులకు మాత్రం నీటితో నింపుతారన్నారు. తాగు, సాగు నీటి కోసం వస్తున్న నీటిని నిల్వ ఉంచేందుకు రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. శాంతిపురం మండలంలోని మాదనపల్లె, గుడుపల్లె మండలం యామగానిపల్లె గ్రామ సమీపంలోని పెద్దవంకకు రెండు రిజర్వాయర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేవలం నాలుగున్నరేళ్లలో చేసి చూపించారన్నారు. అయితే దీనిని చూసి ఓర్వలేక టీడీపీ అధినేతతో సహా ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు వాస్తవాలేమిటో గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, కన్వీనర్ రామక్రిష్ణ, కో–కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

రామకుప్పం: ఈ నెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుప్పం పర్యటన నేపథ్యంలో శుక్రవారం రాజుపేట సమీపంలో చేస్తున్న ఏర్పాట్లను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. హంద్రీ–నీవా కాలువ సమీపంలో హెలిప్యాడ్, పూజా కార్యక్రమాలు చేసే స్థలాలను పరిశీలించారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రామకుప్పం రాక

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం రామకుప్పం మండలంలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. మండలంలోని రాజుపేటలో ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ, మిట్టపల్లె సమీపంలో రైతు భరోసాకేంద్రం, రామకుప్పంలో డీసీసీబీ బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారన్నారు. అనంతరం కుప్పంలో (జ్యోతినగర వైశ్య) గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్

వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లపై సమీక్ష



ప్రసంగిస్తున్న జిల్లా ఎల్‌ఏటీఓ డాక్టర్ వెంకటప్రసాద్

శాంతిపురం: 26న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పర్యటన పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య శాఖ చేయాల్సిన ఏర్పాట్లపై నియోజకవర్గంలోని పీహెచ్‌సీల వైద్యులతో ఆ శాఖ అధికారులు సమీక్షించారు. శుక్రవారం మండల సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్‌ఏటీఓ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ, సీఎం సభా ప్రాంగణం వద్దకు వచ్చే ప్రజలకు అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలతో శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. శాఖకు కేటాయించే స్టాళ్ల నిర్వహణకు నియోజకవర్గంలోని వైద్యాధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష నోడల్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి, పీహెచ్‌సీల డాక్టర్లు వంశీకృష్ణ, ప్రసాద్, రాజ్‌కుమార్, సుభాష్, యశ్వంత్, లోకేష్, పూజిత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజా కల్యాణం



కల్యాణోత్సవంలో విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయంలో గిరిజ కళ్యాణం వేడుకగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం స్వామి వారి బ్రహ్మ రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్, ఆలయ చైర్మన్ వీరభద్ర తెలిపారు.

అమ్మవారికి వెండి దీపాలు సమర్పణ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మకు అనంతపురం జిల్లా హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన రవికుమార్, లలిత దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి దీపాలను సమర్పించారు. శుక్రవారం వీటిని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డికి అందజేశారు. ఆలయ ఈఓ చంద్రమౌళి వారికి స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో మొక్కులు చెల్లించినట్లు వారు చెప్పారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, పాలక మండలి సభ్యుడు రాజేష్, పాలక మండలి మాజీ సభ్యుడు రాయల్ మోహన్ పాల్గొన్నారు.



వెండి దీపాలను చైర్మన్, ఈఓకు అందజేస్తున్న రవికుమార్ దంపతులు

మార్కెట్ల వేలం

పలమనేరు: మున్సిపాలిటీలోని వారపుసంత, చింతచెట్లు, దినసరి కూరగాయల మార్కెట్లు, చెరువులకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు. వారపుసంత రూ.12.75లక్షలు, కూరగాయల మార్కెట్ రూ.17.98లక్షలు, నీళ్లకుంట చెరువు రూ.19వేలకు పాడి పాటదారులు దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ వేలంలో చింతచెట్లు, బొమ్మిదొడ్డి చెరువుల వేలం వాయిదా వేసినట్లు చెప్పారు.

వేలంలో పంచాయతీకి ఆదాయం

వి.కోట: స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించి శుక్రవారం నిర్వహించిన పలు మార్కెట్ల వేలంలో పంచాయతీకి రూ.28,64,500 ఆదాయం సమకూరినట్లు సర్పంచ్ పీఎస్ లక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రధాన గ్రామ సచివాలయ కార్యాలయంలో డివిజినల్ పంచాయతీ అధికారి లక్ష్మి అధ్యక్షతన వేలం నిర్వహించారు. వారపు సంత మార్కెట్ రూ.2,56,000, దినసరి మార్కెట్ రూ.4,23,000, ప్రైవేట్ బస్టాండ్ రూ.10,51,000, వారపు పశువుల సంత రూ.4,51,000, జంతు వధశాల రూ.15,500, గొర్రెలు, మేకల సంత రూ.4,68,000, కమ్యూనిటీ మరుగుదొడ్లు రూ.2లక్షలకు వేలంలో దక్కించుకున్నారని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో ఈఓ యాదవపతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, వేలం పాటదారులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

కుప్పం: రాబోవు ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ వికలాంగుల రీజినల్ కో–ఆర్డినేటర్ రెడ్డెప్ప కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అంతేకాకుండా గతంలో ఆగిపోయినా ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ కార్పొరేషన్ రుణాలు 30 పైసల వడ్డీకే ఇస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు.

వైష్ణవీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

చౌడేపల్లి: మండలంలో పుదిపట్లలోని శ్రీ వైష్ణవీదేవి ఆలయంలో శుక్రవారం మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ రెడ్డి అభయ ఆంజనేయస్వామి, వైష్ణవీదేవి, నాగభైరవస్వామిలకు పూజలు చేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



మసీదులు, శ్మశానవాటికల్లో శుభ్రం



కబరస్థాన్‌లో శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

పుంగనూరు: షాబాన్ పండుగ సందర్భంగా మసీదులు, శ్మశాన వాటికలను శుభ్రం చేయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్.పేటలోని కబరస్థాన్ (శ్మశానవాటిక) శుభ్రం చేసే పనులకు పూనుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ, రంజాన్ ఉపవాసాలు ఆచరించడం వచ్చే నెల నుంచి ప్రారంభమవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, సీమజి ల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, అంజుమన్ మతపెద్దలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పార్టీ నాయకులు

కుప్పం రూరల్: మండలంలోని ఉర్లవోబనపల్లె పంచాయతీ కూర్మానుపల్లె చెందిన వెంకటమ్మ (78) వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం మరణించింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ వారి కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ అబ్బు, ఎంపీటీసీ సత్తార్, పార్టీ ప్రెసిడెంట్ జయప్రకాశ్ శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం నిమిత్తం రూ.5వేలను అందజేశారు.

సారా స్వాధీనం: నిందితుడి అరెస్ట్

పెద్దపంజాణి: సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం.. మండలంలోని రాయలపేట–పెద్దకాప్పల్లె మార్గంలోని జెడ్పీ హైస్కూలు వద్ద ఎస్‌ఐ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేశారు. ఆ సమయంలో స్కూటీలో ఓ వ్యక్తి 20 లీటర్ల సారా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు చౌడేపల్లె మండలం కేతనపల్లెకు చెందిన శివకుమార్ అని తేలింది. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సేవాలాల్ కమిటీ అధ్యక్షుడిగా ఈశ్వర్ నాయక్

పుంగనూరు: సుగాలిమిట్టలోని సేవాగడ్ అభివృద్ధి చేయాలని మండలంలోని ఏడు బంజార తాండాల నాయకులు నిర్ణయించారు. శుక్రవారం సేవాలాల్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఈశ్వర్‌నాయక్, జనరల్ సెక్రటరీగా రెడ్డినాయక్, కోశాధికారిగా గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా బాలాజినాయక్, శంకర్‌నాయక్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీరాములునాయక్, నాగరాజనాయక్, కమిటీ సభ్యులుగా శంకర్‌నాయక్, మునినాయక్, రెడ్డెప్పనాయక్, నరసింహులునాయక్, వాసునాయక్, మునిరత్నంనాయక్, శివాజినాయక్, నాగరాజునాయక్‌లను ఎన్నుకున్నారు.



సేవాలాల్ కమిటీ కార్యవర్గం

జగనన్న వెంటే యువత



సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

- వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధిని చాటిచెప్పండి
- పార్టీని మరోసారి గెలిపించుకుందాం
- యూత్‌కు ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపు

గంగవరం: రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, మరోసారి ఇదే సంక్షేమ పాలన కోసం యువకులు మళ్లీ జగనన్నకు పట్టం కట్టాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గంగవరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. జగనన్న సీఎం అయ్యాక సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేశారని, దీనికి లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చారన్నారు. దీంతో పాటు వలంటీర్ వ్యవస్థతో లక్షలాది మందికి సేవ చేసే అవకాశం కల్పించారన్నారు. ఆశావర్కర్లకు రూ.3 వేల నుంచి రూ.10వేలు, అంగన్‌వాడీలకు రూ.11,500, పారిశుధ్య కార్మికులకు రూ.18వేలు, హోంగార్డులకు రూ.20వేలకు పైగా జీతాలిచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీపై పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీతోపాటు కొత్తగా కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ యూత్ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారి, ఎంతగా పేరొచ్చిందో అందరికే తెలుసని, వైఎస్సార్ సీపీ పాలనలో వివిధ రంగాల అభివృద్ధి ఎంతగా పరుగులు తీసిందో ప్రజలకు యూత్ చాటిచెప్పాలన్నారు. ప్రజల రక్తాన్ని పీల్చే టీడీపీ కావాలో, లేదా ప్రజలకు సంక్షేమాన్ని కల్పించే వైఎస్సార్‌సీపీ పాలన కావాలో జనానికి వివరించాల్సిన బాధ్యత కూడా ఉందని మార్గదర్శనం చేశారు. సమావేశంలో యూత్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్, జిల్లా అధ్యక్షులు హేమంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, కార్యదర్శులు మంజునాథ్ రెడ్డి, జావీద్, గంటాలోకేష్ పలమనేరు రూరల్ మండల అధ్యక్షులు కల్లాడు రామచంద్రారెడ్డి, బాలాజి, మహేష్, సుబ్రమణ్యం, కిశోర్‌నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు స్పందన



చౌడేపల్లి: దుర్గసముద్రంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



గుడుపల్లె: మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పెద్దపంజాణి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం పేదలకు వరమని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని తుర్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ దీనిని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 186 మందికి వైద్యాధికారులు గ్రీష్మబిందు, రాహుల్, మౌనిక, మరియమ్మ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్స కోసం ఒకరిని రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, సర్పంచ్ మురళి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

283 మందికి వైద్య పరీక్షలు

చౌడేపల్లి: మండలంలోని దుర్గసముద్రం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. మొత్తం 264 మందికి వైద్య పరీక్షలుచేసి మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ పూజ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డితో కలిసి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ శ్రీరాములు, సర్పంచ్ సరస్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లెలో 123మందికి..

గుడుపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష–2 నిర్వహిస్తోందని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక హెల్త్ సెంటర్లలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డిల్‌షిన్ ఆధ్వర్యంలో 123కి వైద్యపరీక్షలు చేసి, మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి శంకర్, కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశు మరణాలపై వైద్య బృందం పరిశీలన



రాజనం గ్రామంలో పశువులను పరిశీలిస్తున్న వైద్యులు

- పోస్టుమార్టంకు అంగీకరించని రైతులు
- పశువులు కాల్షియం లోపంతో బాధపడుతున్నట్లు బృందం వెల్లడి
- వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఆరీఫ్

కుప్పం రూరల్: వేసవిలో పాడి రైతులు పశువుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఆరీఫ్ అన్నారు. రెండు నెలలుగా రాజనం గ్రామంలో తరచూ పశువుల మరణిస్తుండటంపై ఆరీఫ్, వైద్య బృందంతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. మరణించిన పశువులకు పోస్టుమార్టం నిర్వహించేందుకు రైతులు అంగీకరించకపోవడంతో అధికారులు గ్రామంలోని పశువులను పరిశీలించారు. నమూనాలు సేకరించి తిరుపతి, చిత్తూరులోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపినట్లు చెప్పారు. అనంతరం ఆరీఫ్, వ్యాధి నిర్ధారణ కేంద్రం ఉప సంచాలకులు మృణాళిని విలేకరులతో మాట్లాడారు. పశువుల్లో కాల్షియం శాతం తక్కువగా ఉందని చెప్పారు. 8–11 ఉండాల్సి ఉండగా, 3.9% మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. కాల్షియం పెరుగుదలకు లవణ మిశ్రమం నిత్యం 50–100 గ్రాములు పాడి పశువులకు పట్టాలన్నారు. గత నెలలో 30, ఇప్పుడు మరో 10 శాంపిల్స్ సేకరించిన ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. రైతులు ప్రభుత్వ పశు వైద్యశాలల్లోనే పరీక్షలు చేయించాలన్నారు. వేసవిలో వైద్యులు సలహాలు–సూచనలు పాటించాలన్నారు. పశువులకు ఏవైనా సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తేవాలని కోరారు. పశువులు మరణించినప్పుడు పోస్టుమార్టం, ఇతర పరీక్షలకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ రెడ్డికుమారి, డాక్టర్ జయశ్రీ పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులతో భూగర్భ జలాల పెంపు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో చేసిన వాటర్‌షెడ్ పనులతో భూగర్భ జలాల మట్టం పెరగడానికి దోహదం చేస్తుందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పులిచెర్ల మండలపరిషత్ కార్యాలయంలో వాటర్‌షెడ్ పనుల సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో ఈపీఏ పథకంలో 70 పనులకు రూ.31.లక్షలు, ఎన్‌ఆర్‌ఎంలో 90 పనులకు రూ.2.0 కోట్లు, పిఎస్‌ఐలో 502మంది రైతులకు రూ.91లక్షల విలువచేసే పనిముట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. క్షేత్ర స్థాయి పనుల్లో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదని సామాజిక తనిఖీ సిబ్బంది నివేదించారు. అడిషనల్ పీడీ ఉమావాణి, జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, ఈఈ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనందరెడ్డి, ఎంపీడీఓ సురేష్ బాబు, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, జేఈ తేజ, టీఏలు షబ్బీర్, దొరైరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

మామిడి తోటకు నిప్పు

చౌడేపల్లి: మామిడితోటకు నిప్పు అంటుకున్న ఘటన శుక్రవారం చెడుగుట్లపల్లె సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కడియాల మహేష్ బాబుకు చెందిన మామిడితోటలో మంటలు రేగాయి. మంటలను గుర్తించిన రైతు సమాచారమివ్వడంతో పుంగనూరు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే రూ50 వేల ఆస్తినష్టం కలిగిందని బాధిత రైతు చెప్పాడు. గుర్తు తెలియని వ్యక్తులు మామిడితోటకు నిప్పు అంటించినట్టు అనుమానం వ్యక్తం చేశాడు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది